సాక్షి
పెద్దపల్లి

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



గోదావరిఖని : బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖనిలో.. చిన్నారి గణపతి





మంథనిలో వినాయకుని నిమజ్జనం



గోదావరిఖని : ప్రధాన చౌరస్తాలో వినాయక శోభాయాత్రకు హాజరైన భక్తజనం



పెద్దపల్లి ఎల్లమ్మ చెరువులో వినాయకుని నిమజ్జనం



గోదావరిఖని గోదావరి నదిలో..



గోదావరిఖని : గణేశుని శోభాయాత్రలో నృత్యం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు రాకూర్ మక్కాన్ సింగ్



గోదావరిఖని : గణేశుని శోభాయాత్రలో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే చందర్



జ్యోతినగర్ : ప్రత్యేక దుస్తుల్లో ఆకట్టుకున్న మహిళా భక్తులు

# గంగమ్మ ఒడికి గణనాథుడు

తొమ్మిది రోజుల పాటు పూజలు ● భజనలు.. హోమాలు.. అన్నదానాలు ● చివరిరోజు వైభవంగా నిమజ్జనం ● వేడుకలకు హాజరైన ప్రముఖులు ● వినాయకుడికి ఘనంగా వీడ్కోలు

సాక్షి, పెద్దపల్లి/గోదావరిఖని/పెద్దపల్లిరూరల్/మంథని: తొమ్మిది రోజుల పాటు నిత్యపూజలు అందుకున్న వినాయకుడికి బుధవారం అశేషభక్తజనం ఘనంగా వీడ్కోలు పలికింది.'జై బోలో గణేశ్ మహారాజ్‌కి జై.. గణపతి పప్పా మోరియా' నినాదాలతో జలవనరుల్లో నిమజ్జనం చేసింది. జిల్లాకేంద్రంతోపాటు గోదావరిఖని, సుల్తానాబాద్, మంథనిలో భక్తిభావం ఉప్పొంగేలా శోభాయాత్ర నిర్వహించారు. యువత కేరింతలు.. మహిళల కోలాటాలు, చిన్నారుల ఆటాపాటలతో దారిపొడవునా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. డప్పుచప్పుళ్లు, టపాసుల పేల్చివేతలు శోభాయాత్రను హోరెత్తించారు. పెద్దపల్లి ఎల్లమ్మ చెరువు వద్ద కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, డీసీపీ వైభవ్ గైక్వాడ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. గోదావరిఖనిలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్, సీపీ రెమా రాజేశ్వరి, మేయర్ బంగి అనిల్‌కుమార్ వేడుకలకు హాజరయ్యారు. పోలీసులు, మున్సిపల్, వైద్య, విద్యుత్, రెవెన్యూ, అగ్నిమాపక తదితర శాఖలు నిమజ్జనం ముగిసే వరకూ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించారు.



పెద్దపల్లిలో గణపతి ఊరేగింపు, ఎల్లమ్మ చెరువులో నిమజ్జనం



గోదావరిఖని : గణేశుని శోభాయాత్రలో సోమారపు సత్యనారాయణ



పెద్దపల్లిలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే దాసరి, అదనపు కలెక్టర్ అరుణశ్రీ



పెద్దపల్లిలో ఆకట్టుకున్న బ్యాండ్ మేళా



పెద్దపల్లిలో కోలాటం ఆడుతున్న మహిళలు



గోదావరిఖని : గోదావరి వంతెనపై మహిళా భక్తులు



పెద్దపల్లి పట్టణంలో రిక్షాపై గణేశుని ఊరేగిస్తున్న మహిళా భక్తులు



గోదావరిఖని : గణేశునితో భక్తులు



పెద్దపల్లిలో యువతుల సెల్ఫీ



సుల్తానాబాద్ : పట్టణ శివారు చెరువులో వినాయకుని నిమజ్జనం

# 'గుర్తింపు'పై గందరగోళం

● నాటకీయ పరిణామాల మధ్య నోటిఫికేషన్
● అయోమయంలో సింగరేణి కార్మికులు

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలపై గందరగోళం నెలకొంది. కోడ్ ఆఫ్ డిసిప్లేన్ మార్చాలకే ఎన్నికలు నిర్వహించాలని మెజార్టీ సంఘాలు.. హైకోర్టు తీర్పు ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ, బీఎంఎస్.. ఇలా నాటకీయ పరిణామాల మధ్య ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తూ డిప్యూటీ సీఎల్‌సీ శ్రీనివాసులు బుధవారం ఆదేశాలు జారీచేశారు. దీంతో మెజార్టీ కార్మిక సంఘాలు అవాక్కయ్యాయి. యాజమాన్యం కూడా దీనిని జీర్ణించుకోలేక పోతోంది. అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్ల నిమగ్నమైన రాష్ట్ర యంత్రాంగం.. సింగరేణిలో ఎన్నికల నిర్వహణ ఎలా సాధ్యమవుతుందని యాజమాన్యం తలపట్టుకుంది.

**కార్మిక శాఖ నుంచి ఆహ్వానం..**

ఈనెల 27న(బుధవారం) జరిగిన సమావేశాలకు హాజరుకావాలని రాష్ట్ర కార్మిక శాఖ నుంచి సింగరేణిలోని రిజిష్టరైన 14కార్మిక సంఘాలకు పిలుపు వచ్చింది. ఈక్రమంలో సింగరేణి అప్పటికే ఎన్నికలు వాయిదా వేయాలని రిట్ దాఖలు చేయగా దాన్ని కొట్టివేసి వచ్చెనెల 30లోగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది.



సమావేశమైన కార్మిక సంఘాల నాయకులు

**ఆహ్వానించిన యాజమాన్యం**

అయితే, కార్మిక శాఖ వద్ద సమావేశం ఉన్న నేపథ్యంలో యాజమాన్యం అప్రమత్తమైంది. సంస్థవ్యాప్తంగా ఉన్న 14రిజిష్టర్డ్ కార్మిక సంఘాలను చర్చలకు రావాలని ఆహ్వానించింది. అయితే, టీబీజీకేఎస్, జాతీయ కార్మిక సంఘాలైన ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్‌తోపాటు మరో 8 యూనియన్లు చర్చలకు వెళ్లాయి. ఇదేక్రమంలో ఏఐటీయూసీ, బీఎంఎస్ కార్మిక శాఖ వద్దకు వెళ్లాయి. కోర్టు ఆదేశాల మేరకు ఎలాగైనా ఎన్నికలు నిర్వహించాలని రెండు సంఘాలు పట్టుబట్టడంతో డిప్యూటీ సీఎల్‌సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు.

**యాజమాన్యం లేకుండానే షెడ్యూల్ విడుదల**

సింగరేణి యాజమాన్యం, మెజార్టీ కార్మిక సంఘాల ప్రమేయం లేకుండానే కార్మిక శాఖ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. యాజమాన్యం ప్రమేయం లేకుండా షెడ్యూల్ విడుదల చేస్తే ఎన్నికల ఏర్పాట్లు ఎవరు చేయాలనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మిగతా మెజార్టీ కార్మిక సంఘాలు కోడ్ ఆఫ్ డిసిప్లేన్ మార్చాకే ఎన్నికలు నిర్వహించాలని, అప్పటివరకు తాము డిప్యూటీ సీఎల్‌సీ నిర్వహించే సమావేశాలకు హాజరు కాలేమని స్పష్టం చేశాయి. ఈక్రమంలో ఎన్నికలపై నిర్వహించే ఈసమావేశం వచ్చేనెల 7వ తేదీకి వాయిదాపడింది.

**తొలిసారి ఎన్నికలు ఇలాగే..**

సింగరేణిలో తొలిసారి జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు ఇలాగే బీజం పడింది. కాకపోతే రాష్ట్రప్రభుత్వం, యాజమాన్యం అంగీకారంతోనే ఎన్నికలు జరిగాయి. తొలిసారి జాతీయ కార్మిక సంఘాలు వ్యతిరేకించగా, సాజక్, ఐఎఫ్‌టీయూ ఎన్నికలు నిర్వహించాలని కోరాయి. ఏదిఏమైనా అసెంబ్లీ, సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణ సాధ్యమేనా? అనే చర్చ మొదలైంది.

# నెలాఖరులోగా రుణమాఫీ

● కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో రైతురుణమాఫీ ఈనెలాఖరులోగా పూర్తిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంకటేశ్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. అగ్రిప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు గల అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 2,579 మహిళా సంఘాలకు రూ.150.74కోట్లు, మెప్మాలోని 284 సంఘాలకు రూ.18.90 కోట్ల రుణాలు అందించామని పేర్కొన్నారు. విద్యావంతులైన యువతకు స్వయం ఉపాధి రుణాలు అందించడంలో అధికారులు చొరవ చూపాలని కోరారు. డీఆర్డీవో శ్రీధర్, డీఏవో ఆదిరెడ్డి, ఉద్యావన అధికారి జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అలుపెరుగని యోధుడు 'కొండా'

పెద్దపల్లిరూరల్: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకభూమిక పోషించిన పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరచిపోలేమని వక్తలు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

### 2న మెగా రక్తదాన శిబిరం



స్థల పరిశీలన చేస్తున్న పోలీసు అధికారులు

పెద్దపల్లిరూరల్: అక్టోబర్ 2న చేపట్టిన మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఏసీపీ మహేశ్ కోరారు. బుధవారం స్థానిక ఐటీఐ మైదానంలో చేపట్టిన శిబిరం ఏర్పాట్లు పరిశీలించారు. రాష్ట్రంలోని 21 జిల్లాల రెడ్‌క్రాస్ సొసైటీల సభ్యులు శిబిరం నిర్వహణకు సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. యువతీయువకులు 7వేల మందికిపైగా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో సీఐలు అనిల్, జగదీశ్, ఎస్‌ఐలు మహేందర్, మల్లేశ్ పాల్గొన్నారు.

### పత్తి రైతులకు అండగా ఉందాం

పెద్దపల్లిరూరల్: పత్తి రైతులు సాధించిన దిగుబడులకు మద్దతు ధర కల్పించి అండగా ఉందామని అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ అన్నారు. బుధవారం పత్తి కొనుగోళ్లపై అధికారులతో సమావేశమై పలు సూచనలిచ్చారు. జిల్లాలో 5,7650 ఎకరాల్లో పత్తి సాగవుతోందని, దాదాపు 5.30లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశముందని వ్యవసాయాధికారులు నివేదించారని పేర్కొన్నారు. క్వింటాలు కనీస మద్దతు ధర రూ.7020 గా నిర్ణయించారని వివరించారు. డీఎంవో ప్రవీణ్‌రెడ్డి, తూనికలు, కొలతల అధికారి విశ్వేశ్వర్, డీటీవో రంగారావు, డీఏవో ఆదిరెడ్డి పాల్గొన్నారు.

### ఓపెన్ టెన్త్‌లో ప్రవేశాలు

పెద్దపల్లిరూరల్: ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు ఈనెలాఖరు లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ చల్వాజీ నాగేశ్వరరావు తెలిపారు. ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకుని, డాక్యుమెంట్లను సెంటర్‌లో అందజేయాలని సూచించారు.

### కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయరమణారావు

ఎలిగేడు(పెద్దపల్లి): కార్యకర్తల సమష్టి కృషితో పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. శివపల్లిలోని తన నివాసంలో బుధవారం ఓదెల మండలం శానగొండకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కోదాటి తిరుపతిరావు(కో ఆప్షన్ సభ్యుడు), నాంద్ర తిరుపతి, లక్ష్మణ్‌రావు, శ్రీరాముల స్వామి, రంగు ప్రసాద్, బీనవేని రవి, కామిడి శ్రీనివాసరెడ్డి, వడ్లకొండ శ్రీనివాస్, అంగిడి శ్రీనివాస్ కాంగ్రెస్‌లో చేరారు. ఉపసర్పంచ్ రంగు శంకర్, కోదాటి సంపత్‌రావు, మేర్గ అశోక్, బీనవేని కుమారస్వామి, కోదాటి మనోహర్‌రావు, అరెల్లి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

### 'ఎల్లంపల్లి'కి జలకళ



నిండుకుండా ఎల్లంపల్లి ప్రాజెక్టు

రామగుండం: ఎగువన ఉన్న కడెం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చిచేరుతోంది. దీంతో ఎల్లంపల్లి ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా, నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు. ప్రస్తుతం నీటిమట్టం 147.99 మీటర్లు, నీటినిల్వలు 20.147 టీఎంసీకు చేరింది. ఇన్‌ఫ్లో 24,758 క్యూసెక్కులు కొనసాగుతోంది. ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి 16,530 క్యూసెక్కులు వదులుతున్నారు.

### యూరియా కోసం బారులు



పీఏసీఎస్ గోదాము వద్ద ఎదుట రైతుల బారులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఈ వానాకాలంలో సాగుచేసిన వరి పొట్టదశ, పత్తి మొగ్గదశ, మొక్కజొన్న జల్లు దశలో ఉన్నాయి. వీటికి ఇప్పుడు యూరియా వేయాల్సి ఉంది. కానీ, ప్రస్తుతం కొరత ఏర్పడింది. రైతులు ఉదయాన్నే సింగిల్‌విండో గోదాముల వద్దకు చేరుకుని పడిగాపులు కాస్తున్నారు. రోజూ ఒక లారీలో పది టన్నులు యూరియానే వస్తోంది. రైతులు ఒక్కసారిగా వచ్చి యూరియా తీసుకెళ్తున్నారు. ఉదయం పది గంటలకు షాపులు తెరవగానే 11 గంటల వరకే నిల్వలు ఖాళీ అవుతున్నాయి. రైతులకు నిరీక్షణ తప్పడంలేదు.

# ఓవర్‌లోడ్‌తో ప్రమాదాలు






కదంబాపూర్ క్వారీ నుంచి కరీంనగర్ పరిశ్రమకు గ్రానైట్ రాయితీ తీసుకెళ్తున్న లారీ ఇది. నిబంధనల ప్రకారం 50 టన్నుల నుంచి 55 టన్నులు తరలించాలి. కానీ, 10 టన్నుల నుంచి 20 టన్నులు అదనంగా తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు.. రాళ్లు నిర్దిష్టమైన ఆకారంలోనూ లేవు. కింద పడకుండా రక్షణ చర్యలూ తీసుకోలేదు. ప్రమాదకరంగా గ్రానైట్ రాళ్లు ఇలా తరలిస్తున్నా జిల్లా టాస్క్‌ఫోర్స్, మైనింగ్, ఎంవీఐ అధికారులు పట్టుకున్న దాఖలాలు లేవు.

- పరిమితికి మించి గ్రానైట్ తరలింపు
- ధ్వంజమవుతున్న రహదారులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి గ్రానైట్‌రాయిని లారీల్లో అధిక బరువుతో తరలిస్తున్నారు. పరిమితికి మించి బండరాళ్లను తరలిస్తున్న లారీలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇటీవల స్థానిక మసీదు ఎదుట ఓవర్‌లోడ్‌తోపాటు ఫిట్నెస్‌లేని లారీలోని బండరాయి కింద పడింది. సమీపంలోని ఇల్లు స్వల్పంగా ధ్వంసమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఇటీవల కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా సమీపంలో మరో లారీ ఢీకొనడంతో వృద్ధురాలు మృతి చెందింది.

**జిల్లాలో 30 క్వారీలు..**

- జిల్లాలో 30 గ్రానైట్ క్వారీలు ఉన్నాయి.
- సుల్తానాబాద్, ఓదెల, ధర్మారం, జూలపల్లి, పాలకుర్తి మండలాల్లో ఉన్న వీటిద్వారా కరీంనగర్ తదితర ప్రాంతాల్లోని పరిశ్రమలకు లారీల్లో గ్రానైట్ తరలిస్తున్నారు. లారీ సామర్థ్యాన్ని బట్టి 45 టన్నుల నుంచి 55 టన్నులు, ట్రాక్టర్లలో 5 టన్నుల వరకు రాయిని తరలించేందుకు గనులు, భూగర్భశాఖ అధికారులు అనుమతి మంజూరు చేస్తున్నారు.

**ఇష్టారాజ్యంగా తరలింపు**

నిబంధనలు అతిక్రమిస్తూ కొన్ని లారీల్లో అధిక లోడ్‌తోపాటు నిర్దిష్టమైన ఆకారంలేని గ్రానైట్ తరలిస్తున్నారు. క్వారీల నుంచి పరిశ్రమలకు తరలించే సమయంలో రాళ్ల ఎత్తుపల్లాలు సరిగా ఉండేలా కటింగ్ చేసి పంపించాలి. నిర్వాహకులు అలాంటి నిబంధనలేమీ పాటించడం లేదు. ఎవరూ పట్టించుకోవడం లేదనే ఉద్దేశంతో రాత్రి వేళల్లో రవాణా చేస్తున్నారు. సామర్థ్యానికి మించి రవాణా చేయడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల కేంద్రాలు, గ్రామాలే కాదు.. ప్రధాన రహదారులు కూడా ఓవర్‌లోడ్ లారీల రాకపోకలతో దెబ్బతింటున్నాయి. ఈవిషయంపై అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా స్పందన రావడంలేదు.

### రక్షణ చర్యలు లేవు



లారీల్లో గ్రానైట్‌రాళ్లను ఓవర్‌లోడ్‌తో తరలిస్తున్నారు. రహదారులు ధ్వంసమవుతున్నాయి. ప్రమాదమని తెలిసినా నిబంధనలకు విరుద్ధంగా పెద్ద బండరాళ్లు తరలిస్తున్నారు. కింద పడకుండా రక్షణ చర్యలు చేపట్టడం లేదు.

– కల్లేపల్లి జానీ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గర్రెపల్లి

### రోడ్లు ధ్వంసం



లారీల్లో ఓవర్ లోడ్‌తో గ్రానైట్ రాళ్లు తరలించడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. ఓవర్ లోడ్ లారీలను అదుపు చేయాలి. అధికారులు తనిఖీలు చేయకపోవడంతోనే తరచూ ఇలా జరుగుతోంది. అధికారులు స్పందించాలి.

– మహిపాల్‌రెడ్డి, కిసాన్‌మోర్చా నేత, సుల్తానాబాద్

### సమాచారం ఇవ్వండి



రోడ్లపై ఓవర్‌లోడ్‌తో వాహనాలు వెళ్తే మాకు సమాచారం ఇవ్వండి. మా అధికారులు వచ్చి తనిఖీలు చేస్తారు. ఎంవీఐలు అందుబాటులో ఉంటారు. ఓవర్‌లోడ్ ఉన్నట్లు తేలితే తనిఖీలు చేసి బాధ్యులకు జరిమానా విధిస్తాం

– రంగారావు, ప్రాంతీయ రవాణాశాఖ అధికారి

### ఫిర్యాదు చేయండి



జిల్లాలో 30 క్వారీలకు అనుమతి ఉంది. అనుమతి పొందినవారే గ్రానైట్ తవ్వకాలు చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. నిబంధనలు అతిక్రమించినట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– సాయినాథ్, ఏడీ, భూగర్భ గనుల అధికారి

# 1న ఐటీ పార్క్ పనులకు భూమిపూజ

- కుర్జీకమ్మి భూముల పట్టాలు పంపిణీ
- జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో దశాబ్ది ప్రగతి సభ
- హాజరుకానున్న మంత్రి కేటీఆర్
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: మంత్రి కేటీఆర్ హాజరైయ్యే దశాబ్ది ప్రగతి సభను విజయవంతం చేయాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చేనెల ఒకటో తేదీన మంత్రి కేటీఆర్ గోదావరిఖనిలో జరిగే బహిరంగ సభకు హాజరవుతారన్నారు. జూలైలోలో జరిగిన నవనిర్మాణ సభలో కేటీఆర్ ఇచ్చిన హామీ మేరకు రూ.100 కోట్లు మంజూరు చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో బహిరంగ సభకు లేర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా ఐటీ, ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపన, రూ.100 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల పైలాన్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 50ఏళ్లుగా రాయదండి, పెద్దంపేట రైతులు నిరీక్షిస్తున్న కుర్జీకమ్మీ భూపట్టాలు, గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తారని వివరించారు.

**కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం**

సింగరేణి కార్మికులకు 32శాతం లాభాల బోనస్ ప్రకటించడాన్ని హర్షిస్తూ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి ఎమ్మెల్యే చందర్ పాలాభిషేకం చేశారు. నగరమేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు ఇంజపురి పులేందర్, కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. స్థానిక రాజేశ్ థియేటర్ సమీపంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే చందర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు ఇంజపురి పులేందర్, కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, కో ఆప్షన్ సభ్యులు వంగ శ్రీనివాస్‌గౌడ్, రఫీక్, ప్యాక్స్ చైర్మన్ మామిడాల ప్రభాకర్, నాయకులు కలువల సంజీవ్, చిప్ప రాజేశం, నూతి తిరుపతి, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కేంద్రాల జీవితకాలం 25 ఏళ్లే..



మాట్లాడుతున్న ప్రతినిధులు

- పరిశ్రమల్లో సాంకేతిక సమస్యలు సాధారమే..
- రామగుండం బీ–థర్మల్ కేంద్రానికి 50 ఏళ్లు పూర్తి
- అక్టోబర్ మొదటివారంలో మళ్లీ ఉత్పత్తి దశలోకి..

రామగుండం: విద్యుత్ కేంద్రాల జీవితకాలం 25 ఏళ్లు మాత్రమే, కానీ రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రం జీవితకాలానికి రెండింతలు పూర్తయ్యాయని, తద్వారా తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడం సాధారణమేనని జెన్‌కో డైరెక్టర్లు వెల్లడించారు. విద్యుత్ సౌధ నుంచి థర్మల్, ప్రాజెక్టు, సివిల్, హైడల్ డైరెక్టర్లు లక్ష్మయ్య, సచ్చిదానందం, అజయ్, వెంకట్రాజంతోపాటు చీఫ్ ఇంజినీర్(జనరేషన్) రత్నాకర్‌రావు తదితరులు విద్యుత్ కేంద్రంలోని కీలక మిల్స్, బాయిలర్, టర్బయిన్ తదితర విభాగాల పనితీరు పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీ థర్మల్ కేంద్రాన్ని రెనోవేషన్, మోడరైజేషన్(ఆర్‌అండ్‌ఎం)కు నిధులు కేటాయించే పరిస్థితి లేదని తెలిపారు. కాలంచెల్లిన కేంద్రం కావడంతో తరచూ మిల్స్, బాయిలర్‌లో తలెత్తే సమస్యలను అధిగమించేందుకు విడిభాగాలు తేవాల్సి ఉందని, వాటి లభ్యత కష్టతరంగా మారిందన్నారు. వివిధ విభాగాల పునరుద్ధరణకు ఇప్పటికే రూ.కోట్లు వెచ్చించామని తెలిపారు. వార్షిక మరమ్మతుల కోసం ఈనెల 12న షట్‌డౌన్ చేయడంతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని, అక్టోబర్ మొదటివారంలో ఉత్పత్తి దశలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

### కవితను కలిసిన గౌతం శంకరయ్య



రామగిరి: టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బుధవారం యూనియన్ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సింగరేణి కార్మికులకు లాభాల వాటా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు.

### హామీలు అమలు చేయాలి




నినాదాలు చేస్తున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా జిల్లా నాయకులు ఆడెపు శంకర్, మార్త రామన్న డిమాండ్ చేశారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. కుల, మత వ్యవస్థకు, కుల పీడనలకు వ్యతిరేకంగా 150 ఏళ్లక్రితం మహాత్మా జ్యోతిరావు పూలే సత్యశోధక్ సమాజ్ స్థాపించారని గుర్తుచేశారు. కుల నిర్మూలన చైతన్యానికి కమ్యూనిస్టు, విప్లవ, ప్రజాసామిక శక్తులు కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి వెంకన్న, గూడూరి వైకుంఠం పాల్గొన్నారు.

# యూరియా కొరత తీర్చిన ఆర్‌ఎఫ్‌సీఎల్



సీజీఎంను సన్మానిస్తున్న రఘునందన్‌రావు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారం ప్రారంభించారు. ఇందులో ఉత్పత్తి చేసిన యూరియాలో 50శాతం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించారు. వానాకాలంలో యూరియా వినియోగం అధికంగా ఉంది. దీంతో సీజన్‌కు సరిపడా యూరియా సరఫరా చేయడంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ కీలకపాత్ర పోషించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 5,55,869.25 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేసింది. ఇందులో తెలంగాణ రాష్ట్రానికి ఈ సీజన్‌లో 2,21,081.49 మెట్రిక్ టన్నులు సరఫరా చేసింది. తద్వారా రాష్ట్రంలో కొరతను అధిగమించినట్లయ్యింది. ఈమేరకు తెలంగాణ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.రఘునందన్‌రావు బుధవారం ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం సుధీర్‌కుమార్ ఝాను కలుసుకుని శాలువాతో సన్మానించారు. భవిష్యత్‌లో రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా చేసేలా సహకరించాలని కోరారు.

### మట్టికుప్పలపై పత్తి సాగు



పెద్దపల్లి మండలం నిట్టూరు – ఎలిగేడు మండలం లోకోపేట మధ్య ప్రధాన రోడ్డును ఆనుకుని ఎత్తయిన మట్టికుప్పలపై పత్తి చేను ఆకట్టుకుంటోంది. గత సీజన్‌లో ఇటుకబట్టీ వ్యాపారులు చెరువులో నుంచి పూడికతీసి ఆ పక్కనే కుప్పలు పోశారు. ఆ మట్టిపై రైతులు ఈ సీజన్‌లో పత్తి పండిస్తున్నారు. రోడ్డుపక్కనే ఎత్తుగా పోసిన మట్టికుప్పలపై పచ్చదనంతో కనిపిస్తున్న మొక్కలు, చేనులోజాతీయ జండా వాహనదారులు, స్థానికులను ఆకట్టుకుంటున్నాయి.

– పెద్దపల్లిరూరల్

## బొగ్గుబాయి వార్తలు

# సమస్యలు పరిష్కరించాకే గుర్తింపు ఎన్నికలు

- కాంట్రాక్టు కార్మికులకు ఓటుహక్కు కల్పించాలి
- కోడ్ ఆఫ్ సిప్లేన్‌లో మార్పులు చేయాలి
- రెండేళ్ల కాలపరిమితి విధించాలి
- రిజిష్టర్డ్ కార్మిక సంఘాల డిమాండ్



హైదరాబాద్ సింగరేణి భవన్ ఎదుట కార్మిక నేతలు

గోదావరిఖని: మెజార్టీ రిజిష్టర్డ్ కార్మిక సంఘాలు ప్రస్తావిస్తున్న సమస్యలు పరిష్కరించాకే సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఆయా సంఘాలు డిమాండ్ చేశాయి. హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో డైరెక్టర్(పా) బలరాంతో బుధవారం నాయకులు చర్చలు జరిపారు. కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌లో మార్పులు చేసి, కాంట్రాక్టు కార్మికులకు ఓటుహక్కు కల్పించాలన్నారు. 1998 నుంచి కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహిస్తున్నారని, తద్వారా కార్మికుల ప్రజాస్వామిక హక్కులు కాపాడుకోవాలని సంఘాలన్నీ నిర్ణయించాయని అన్నారు. గుర్తింపు ఎన్నికల నిర్వహణకు తాము వ్యతిరేకం కాదని, చట్టవ్యతిరేకమైన కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధ కార్మిక సంఘాల హక్కు సభ్యత్వం, సమావేశాల నిర్వహణ, గేట్ మీటింగులు, అధికారులతో చర్చలకు తగిన ప్రాధాన్యంతోకూడిన కోడ్ ఆఫ్ డిసిప్లిన్ ఉండాలని కోరారు. ఒకటి, రెండు సంఘాలకే సర్వాధికారాలు కల్పించేందుకు కోడ్ ఆఫ్ డిసిప్లేన్ రూపొందించారని విమర్శించారు. ఈసారి ఎన్నికల ముందే దానిని మార్చాలన్నారు. రెండేళ్ల కాలపరిమితితో ప్రారంభమైన గుర్తింపు ఎన్నికలు నాలుగేళ్లకు పొడిగించారని పేర్కొన్నారు. సమస్యలన్నీ పరిష్కరించి, కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌లో మార్పులను ఎన్నికలకు ముందే ఫైనల్ చేసి షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, టీఎన్టీయూసీ, ఐఎఫ్‌టీయూ, సింగరేణి ఉద్యోగుల సంఘం, తెలంగాణ రీజినల్ సింగరేణి కార్మిక సంఘం, సింగరేణి డ్రైవర్స్, ఈపీ ఆపరేటర్స్ అండ్ యూజీ, ఆల్ ట్రేడింగ్ వర్కర్స్ అసోసియేషన్, శ్రామికశక్తి గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు సమష్టిగా తమ నిర్ణయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు.

# యాజమాన్యంపై చర్య తీసుకోవాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఒప్పందం ఉల్లంఘనకు పాల్పడుతున్న యాజమాన్యంపై చర్య తీసుకోవాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. బుధవారం డిప్యూటీ సీఎల్‌సీకి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అన్నికార్మిక సంఘాల ఆధ్వర్యంలో 2022లో 18 రోజులపాటు సమ్మె చేశామన్నారు. సమ్మెకాలంలో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ వద్ద యాజమాన్యం, కార్మిక సంఘాలతో 2022 సెప్టెంబర్ 26న ఒప్పందం చేసుకున్నామని అన్నారు. ఏడాది గడుస్తున్నా యాజమాన్యం ఒప్పందంలోని అంశాలను అమలు చేయడంలేదని తెలిపారు. దీనిపై డిప్యూటీ సీఎల్‌సీ సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. జీవో నంబర్ 22ప్రకారం వేతనాలు చెల్లించాలని, బోనస్ పెంచాలని, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు ఉచితంగా యూనిఫామ్ ఇవ్వాలని, నర్సరీ కార్మికులను సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించాలని, వారికుటుంబ సభ్యులకు కూడా వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతినెలా 7వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని, పనిని బట్టి స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని యాజమాన్యాన్ని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు అక్బర్‌అలీ, అఫ్రోజ్‌ఖాన్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ పాటించాలి



మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం సాంబయ్య

గోదావరిఖని: ప్రమాదాలు జరగకుండా ప్రతీ ఒక్కరు సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ నిబంధనలు పాటించాలని రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య సూచించారు. బుధవారం ఓసీపీ–3 అప్‌లోడింగ్ ఉద్యోగులకు రక్షణపై సమావేశం నిర్వహించారు. ఆపరేషన్ చేపట్టిన క్వారీలో పూర్తిస్థాయి రక్షణ చర్యలు పాటించాలన్నారు. యంత్రాల ఆపరేటర్లు ప్రమాదాలు జరకుండా చూసుకోవాలని చెప్పారు. ఎస్‌ఎంటీసీ డీజీఎం శర్మతోపాటు కాంట్రాక్టు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# కోలిండియా చైర్మన్ హామీ మేరకు సమ్మె వాయిదా

గోదావరిఖని: కోలిండియా చైర్మన్ పీఎం ప్రసాద్ ఇచ్చిన హామీ మేరకు వచ్చేనెల 5, 6, 7వ తేదీల్లో చేపట్టిన కోలిండియా వ్యాప్త బొగ్గు గనుల్లో సమ్మె వాయిదా వేసినట్లు జాతీయ కార్మిక సంఘాల నాయకులు బుధవారం తెలిపారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుంటామని చైర్మన్ చెప్పినట్లు నాయకులు వివరించారు. ఈలోగా సీఐఎల్ యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకోలేకపోతే అక్టోబర్ 12 నుంచి మూడురోజుల పాటు సమ్మె చేస్తామని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు హెచ్చరించారు.

# ఏపీఏ గనిలో ఆపరేషన్స్ డైరెక్టర్ పర్యటన



గనిపై ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్

రామగిరి: ఆర్జీ–3 డివిజన్ ఏపీఏ గనిలో ఆపరేషన్స్ డైరెక్టర్ శ్రీనివాస్ బుధవారం పర్యటించారు. యంత్రాల వినియోగం పెంచాలన్నారు. షిఫ్టుల వారీగా మ్యాన్ పవర్ గురించి తెలుసుకున్నారు. రక్షణ చర్యలు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. నిర్దేశిత లక్ష్యాలు సాధించాలని సూచించారు. ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, ఏపీఏ, ఓసీపీ–2 పీవోలు నాగేశ్వర్‌రావు, రాజేందర్, అధికారులు జనార్దన్, రఘురామ్, జైనలుద్దీన్, పద్మరాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు తమ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. కేర్, శానిటేషన్, సెక్యూరిటీ తదితర విభాగాల్లోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు 8 నెలలుగా వేతనాలు అందడంలేదన్నారు. ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి 15 క్యాజువల్ సెలవులు, 9 పండుగ సెలవులు ఇవ్వాలని, డ్రెస్సులు మార్చుకోవడానికి రూములు కేటాయించాలని కోరారు. ప్రతినెలా 7వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని చట్టం చెబుతున్నా.. అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. సమ్మె నోటీసు ఇచ్చినా పాలకులు పట్టించుకోవడం లేదని కార్మికులు, సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.